మహిళా సాధికారత కోసం కృషి

జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి కృపామణి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో మహిళా సాధికారత కోసం తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర స్త్రీ నిధి బ్యాంక్ డైరెక్టర్ తోట కృపామణి అన్నారు. కృపామణి జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మహిళా గ్రూపులు గురువారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో కృపామణి మాట్లాడారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించటానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కొయ్యలగూడెం మండలానికి ఎ గ్రేడ్ రావటానికి గ్రామ సంఘాలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎంపిఎం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిసిలు కృప, రీబ్కా, జ్యోతి, సిఎలు సావిత్రి, రత్నకుమారి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'వాటర్‌గ్రిడ్' పట్టాలెక్కేనా..!

గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా జనం గొంతు తడిపే తాగునీటి పథకం 'వాటర్‌గ్రిడ్' పట్టాలెక్కేనా అనే చర్చ రెండు జిల్లాల ప్రజానీకంలో మళ్లీ మొదలైంది. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లపాటు అదిగో.. ఇదిగో అంటూ వాటర్ గ్రిడ్ పథకంపై మోసగించింది. ఆ కోపంతోనే గడిచిన ఎన్నికల్లో రెండు జిల్లాల్లో ఉన్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను కూటమికి కట్టబెట్టిన ప్రజలు తమ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని ఎదురుచూస్తున్నారు. జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన సిఎం, డిప్యూటీ సిఎంలు ఆ దిశగా అడుగులు వేస్తారా.. లేక వైసిపి మాదిరిగా ఊరించి ఉసూరుమన్పిస్తారో వేచిచూడాలి.

- రెండు జిల్లాల్లోనూ అధ్వానంగా తాగునీరు
- తాగునీటికి నెలకు రూ.72 కోట్లు వెచ్చిస్తున్న జనం
- పైప్‌లైన్ ద్వారా గోదావరి జలాలు సరఫరా ఎప్పుడు..?
- ఐదేళ్లపాటు మాటలతో సరిపెట్టిన వైసిపి సర్కార్
- అంచనాలు రూ.3,670 కోట్ల నుంచి రూ.1400 కోట్లకు కుదింపు
- కూటమి ప్రభుత్వమైనా ప్రజల గోడు పట్టించుకునేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లో విచ్చలవిడిగా సాగిన చేపల చెరువుల తవ్వకాలతో సాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. ముఖ్యంగా డెల్టా మండలాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. దాదాపు దశాబ్దంన్నరకాలంగా తాగునీటి కోసం పశ్చిమ, ఏలూరు జిల్లా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడిపోతున్నారు. డబ్బు చెల్లించి కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితి నెలకొంది. ప్రతి కుటుంబం రోజుకు దాదాపు రూ.20 నుంచి రూ.40 వరకూ తాగునీటి కోసం ఖర్చు చేయాల్సిన దుస్థితి దాపురించింది. పంచాయతీ పరిధిలోని తాగునీటి ట్యాంకుల ద్వారా అందించే నీరు తాగడానికి ఏమాత్రం పనికిరాని పరిస్థితి ఉంది. చేపలు, రొయ్యల చెరువుల్లో నీటిని పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఆ నీటినే తాగునీటి చెరువుల్లో నింపుతున్నారు. పసర్లు కమ్మిన నీటిని తాగలేక దాహార్తి తీర్చుకునేందుకు నీళ్లు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండు జిల్లాల్లో దాదాపు 30 లక్షలకుపైగా జనాభా ఉన్నారు. రేషన్‌కార్డుల ప్రాతిపదికన చూస్తే 12 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఒక్కో కుటుంబం రోజుకు రూ.20 చొప్పున తాగునీటికి ఖర్చు చేస్తున్నట్లు లెక్కించినా రోజుకు రూ.2.40 లక్షలు, నెలకు రూ.72 కోట్లు తాగునీటికే జిల్లా ప్రజానీకం ఖర్చు చేస్తున్న పరిస్థితి ఉంది. 2019 ఎన్నికల ప్రచారంలో జిల్లాలో తాగునీటి సమస్యనే ప్రధాన ఎజెండాగా సాగింది. ఎన్నికల ముందు జిల్లాలో పాదయాత్ర నిర్వహించిన వైసిపి అధ్యక్షుడు జగన్ బాటిల్‌లో నీళ్లు చూపించి ఈ నీటిని మనుషులు తాగుతారా అంటూ అప్పటి టిడిపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే వాటర్ గ్రిడ్ పథకం ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామంటూ హామీ ఇచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా 13 చోట్ల ఎంఎల్ఎ, రెండు ఎంపీ స్థానాల్లో వైసిపి అభ్యర్థులను ప్రజలు గెలిపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్‌గ్రిడ్‌పై వైసిపి సర్కార్ హడావుడి చేసింది. మొత్తం రూ.3,670 కోట్లతో అంచనాలు రూపొందించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని గ్రామాలకూ వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పింది. కొన్నాళ్లకు మళ్లీ అంచనాలు సవరించి డెల్టా వరకూ మాత్రమే పరిమితం చేసి అంచనా వ్యయం రూ.1400 కోట్లకు కుదించింది. అయినా ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

తాగునీటి కల నెరవేరేనా..?

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రజల తాగునీటి కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చేనా అనే చర్చ జనాల్లో సాగుతోంది. గోదావరి నదిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం, ఆరికరేవుల, పట్టిసీమ మొత్తం ఐదుచోట్ల పంపింగ్ సిస్టిమ్ ఏర్పాటు చేసి పైప్‌లైన్ ద్వారా తాగునీరు ఇచ్చేలా వాటర్‌గ్రిడ్ పథకానికి రూపకల్పన చేసింది. నరసాపురం, భీమవరం ప్రాంతాల మీదుగా ఒక పైప్‌లైన్, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు వరకూ ఒకటి, పోలవరం నుంచి జంగారెడ్డిగూడెం, చింతలపూడి, లింగపాలెం వరకూ ఇంకో పైప్‌లైన్, కొవ్వూరు, గోపాలపురం, నల్లజర్ల మీదుగా మరో పైప్‌లైన్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. పైప్‌లైన్ల మధ్యలో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు సైతం ఏర్పాటు చేసి రక్షిత తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు. వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటుకు సంబంధించి సర్వేలు సైతం జరిగాయి. వైసిపి ఐదేళ్ల పాలనలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సైతం గడిచిన ఎన్నికల్లో స్వచ్ఛమైన తాగునీటిని జిల్లా ప్రజలకు అందిస్తామని హామీలు గుప్పించారు. దీంతో జిల్లా ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. గడిచిన ఎన్నికల్లో కూటమికి అన్ని సీట్లనూ కట్టబెట్టారు. గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరాపై జిల్లా ప్రజల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందో, లేదో వేచిచూడాలి. ఏదేమైనా జిల్లా ప్రజలను దీర్ఘకాలంగా వెంటాడుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని అంతా కోరుతున్నారు.

పకడ్బందీగా సదరం సర్టిఫికెట్ల పరిశీలన

సూక్ష్మ ప్రణాళిక, రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

సదరం సర్టిఫికెట్ల జారీపై వైద్య బృందాల పరిశీలనకు సూక్ష్మ ప్రణాళిక, రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం అమరావతి నుండి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కె.కన్నబాబు, సెర్ప్ సిఇఒ వీరపాండ్యన్ సదరం సర్టిఫికెట్ల పంపిణీపై రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితోపాటు డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ మాలిని, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిపిఒ కె.అనురాధ, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు, జిజిహెచ్ఎస్ సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు హాజరయ్యారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి రూ.15 వేలు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణ బాబు, సెర్ప్ సిఇఒ వీరపాండ్యన్ తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ లో వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సదరం సర్టికెట్ల పరిశీలనకు రూపొందించిన మార్గదర్శకాలను అధికారులు క్షుణంగా తెలుసుకొని విజయవంతం చేసేందుకు పలు సూచనలు చేశారు. తనిఖీలకు వచ్చే ముందురోజు గ్రామాల్లో సమాచారం తెలియజేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1496 మంది దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన కేటగిరీలో రూ.15 వేలు చొప్పున ప్రతి నెలా పింఛన్ పొందుతున్నారని చెప్పారు. జిల్లాకు విజయవాడ జిజిహెచ్ నుంచి వచ్చే వైద్య బృందంతో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక పిహెచ్‌సి వైద్యులు సమన్వయం చేసుకోవాలన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలని సిపిఎం ఆందోళన

ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పెంచిన విద్యుత్ భారాలను ఉపసంహరించాలని కోరుతూ స్థానికంగా సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు శుక్లబోయిన రాంబాబు, మహాదేవపురం శాఖ కార్యదర్శి కుంజం సంకురమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఉడతా మంగమ్మ, పూసం రామలక్ష్మి, పూసం నాగమణి, పోతుబోయి వీరమ్మ, సోదెం బుచ్చమ్మ, ఉడతా నరసింహారావు, పూసం దుర్గారావు, పూసం చెల్లయ్య, సోదెం గంగరాజు, అద్దాల అక్కమ్మ, కుంజం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ ప్రొఫెసర్‌కు పిహెచ్‌డి పట్టా


రాజశేఖర్‌కు పట్టాను అందిస్తున్న వెంకట్రావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

స్థానిక ఎన్ఆర్ఐ కళాశాలలో బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న రాజశేఖర్ పోతనబోయినకు గీతం యూనివర్శిటీ, విశాఖపట్నం వారిచే పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసినట్లు ఆ కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు తెలిపారు. గీతం యూనివర్శిటీ మేథమెటిక్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ శోభనాపురం పర్యవేక్షణలో ఎంహెచ్‌డి కన్వెక్టివ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఫ్లోస్ ఆఫ్ నాన్ న్యూటోనియన్ నానో ఫ్లూయిడ్స్ విత్ హీట్ సోర్స్ ఆర్ సింక్ అనే అంశంపై పరిశోధనలు చేసినందుకుగానూ ఆయనకు పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసినట్లుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్ తెలిపారు. పిహెచ్‌డి డిగ్రీ పట్టాను కళాశాల ఛైర్మన్ వెంకట్రావు రాజశేఖర్‌కు గురువారం నాడు అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్.జి.రోశయ్య, మేథమెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ బాబూప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

మిగులు భూమిలో పంటలు ధ్వంసం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం పంచాయతీలోని బర్రింకలపాడు తూముల చెరువు సమీపంలో ఉన్న సుమారు 12 ఎకరాల మిగులు భూమిలో వంకవారిగూడెం గ్రామానికి చెందిన కొంతమంది గిరిజనులు మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు. ఆ పంటలను గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు. పంటలను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పంటలు వేసిన గిరిజనులకు అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గంగాధరరావుకు కలెక్టర్ అభినందన

రాష్ట్ర మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన వైనం

గంగాధరరావును అభినందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

విజయవాడ ఫన్ టైం క్లబ్ ఇండోర్ ఆడిటోరియంలో జరిగిన తొమ్మిదో రాష్ట్ర మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఏలూరు నివాసి చిట్టెల గంగాధరరావు 70 ప్లస్ పురుషుల విభాగంలో ఛాంపియన్ గెలవడం ద్వారా యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. ఇటీవల విజయవాడ ఫన్ టైం క్లబ్ ఇండోర్ ఆడిటోరియంలో జరిగిన తొమ్మిదో రాష్ట్ర మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో వెటరన్ విభాగంలో విజేతగా నిలిచిన గంగాధరరావు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాశానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో తోడ్పాటునిస్తాయన్నారు. నేటి యువత ఆధునిక పోకడలకు, కంప్యూటర్ ఆటలకు పరిమితం అవ్వడం వల్ల శారీరక ఆరోగ్యానికి దూరమవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి వెటరన్ టేబుల్ టెన్నిస్ సింగల్ విభాగంలో 70 ప్లస్ కేటగిరీలో ట్రోఫీ కైవసం చేసుకుని విజేతగా నిలిచిన గంగాధరరావు యువతకు, ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలవడం అభినందనీయమని ప్రశంసించారు. నిరంతరం వయస్సును కూడా లెక్క చేయకుండా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగే వెటరన్ విభాగంలో క్రీడల్లో రాణించి ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలవడం విశేషమన్నారు. డిసెంబర్ ఎనిమిదో తేదీన విశాఖపట్నం రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలో, డిసెంబర్ ఒకటో తేదీన విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలో వెటరన్ టేబుల్ టెన్నిస్ సింగల్ విభాగంలో పాల్గొని విజేతగా నిలిచి పలువురి ప్రశంసలు అందుకున్నట్లు వెటరన్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు చిట్టెల గంగాధరరావు తెలిపారు.

రూ.80 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు

రోడ్లు, భవనాల శాఖ డివిజనల్ ఇంజినీర్ బాబూరావు

పనులు చేస్తున్న జెసిబి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని తిరువూరు రోడ్డులో ఉన్న ప్రధాన రహదారిని నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాల మేరకు తిరువూరు వైపు వెళ్లే రహదారి నిర్మించేందుకు యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేస్తున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో 32వ వార్డులోని పెద్ద వంతెన నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్లు, భవనాల శాఖ డివిజనల్ ఇంజినీర్ బాబూరావు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని రోడ్ల మరమ్మతులు, తిరువూరు రోడ్డులో ఉన్న విక్టోరియా టౌన్ హాల్ వద్ద నుంచి సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు సుమారు రూ.80 లక్షల వ్యయంతో చేపట్టినట్లు వివరించారు. మంత్రి పార్థసారధి చొరవతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఇక్కడ రోడ్డు నిర్మాణ పనులు, మరమ్మతులు పూర్తయితే తమ కష్టాలు తీరినట్లేనని వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహాసభకు వేళాయె..!

- నేటి నుంచి మూడు రోజులపాటు సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా 26వ మహాసభ
- ఎర్రజెండాలు, తోరణాలతో భీమవరం ముస్తాబు
- ప్రధాన కేంద్రాల్లో సిపిఎం జెండాల రెపరెపలు
- 3న వేలాది మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ
- 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభ
- జిల్లాలో సమస్యలపై 20 అంశాలతో కూడిన తీర్మానాలు
- మహాసభకు ఏర్పాట్లన్నీ పూర్తి
- సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

యనమదుర్రు వంతెనపై ఆకర్షణీయంగా ఉన్న స్వాగత ద్వారం

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా 26వ మహాసభ భీమవరంలో నేటి నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. మహాసభకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాసభ నేపథ్యంలో భీమవరం పట్టణం ముస్తాబైంది. ఎర్రజెండాలు, తోరణాలతో ముస్తాబు చేశారు. మహాసభకు సంబంధించి ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో కరపత్రాలను పంచిపెట్టారు. ఆటోల్లో మైకు ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా భీమవరం పట్టణాన్ని ఎర్రజెండాలు తోరణాలతో అలంకరించారు. మురుగుకాల్వ వంతెనలు ఇరువైపులా మహాసభ గేట్లు ఏర్పాటు చేశారు. ఓవర్‌బ్రిడ్జి, బస్టాండ్ సెంటర్, జెపి రోడ్, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, ప్రకాశం చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, పోలీస్ బొమ్మ సెంటర్, ఆదివారం బజార్, అభిరుచి సెంటర్ వంటి ప్రధాన కేంద్రాల్లో సిపిఎం జెండాలు తోరణాలతో అలంకరించారు. సభా ప్రాంగణాన్ని, వేదికను ఎర్రజెండాలు, తోరణాలతో అందంగా అలంకరించారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ముగింపు, సిపిఎం జిల్లా 26వ మహాసభ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం పట్టణంలో వేలాది మందితో భారీ ప్రజా ప్రదర్శన చేపట్టనున్నారు. ఈ సందర్భంగా వేలాది మంది అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించేలా ఏర్పాట్లు చేశారు. ఇదే రోజు సాయంత్రం పాత బస్టాండ్ వద్ద భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ మహాసభ ప్రాంగణానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం మహాసభలో ప్రసంగించనున్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ప్రతినిధుల సభ జరగనుంది. ప్రతినిధుల సభ జరిగే ప్రాంతానికి అమరజీవి రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) నగర్, అమరజీవి వలవల శ్రీరామ్మూర్తి ప్రాంగణంగా నామకరణం చేశారు. పట్టణ, మండల మహాసభలో ఎన్నికైన ప్రతినిధులు, పరిశీలకులు, ఆహ్వానితులు కలిపి సుమారు 300 మంది ప్రతినిధుల సభకు హాజరుకానున్నారు. సిపిఎం సీనియర్ నేత, చించినాడ పోరాటయోధుడు కేతా సూర్యారావు ప్రతినిధుల సభ ప్రారంభ సూచికగా జెండా ఆవిష్కరించనున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రతినిధుల సభలో గత మూడేళ్ల నుంచి జరిగిన పోరాటాలు, కార్యకలాపాలను సమీక్షించనున్నారు. రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టబోయే భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను రూపకల్పన చేసేందుకు సమగ్రంగా చర్చించనున్నారు. జిల్లా అభివృద్ధి, ఉపాధి అవకాశాల్లో భాగస్వామ్యంగా ఉన్న రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితులను ఆదుకుని ప్రాజెక్టు పూర్తి చేయడం వంటివి ప్రధాన డిమాండ్లుగా మహాసభ జరుగుతున్నాయి.

మహాసభ ప్రధాన డిమాండ్లు..

★ పార్లమెంట్లో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. అల్లూరి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి.

★ ఆక్వా యూనివర్సిటీకి అల్లూరి పేరు పెట్టాలి.

★ చించినాడ బ్రిడ్జికి, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలుకు అల్లూరి పేరు పెట్టాలి.

★ భీమవరం పాత బస్టాండ్ పక్కనే గతంలో ఉన్న అల్లూరి భవనం స్థలంలో నాలుగు అంతస్తుల అల్లూరి సీతారామరాజు కళా సాంస్కృతిక భవనాన్ని నిర్మించాలి.

★ జిల్లా అభివృద్ధి, ఉపాధి అవకాశాల్లో భాగంగా ఉన్న రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితులను ఆదుకుని, ప్రాజెక్టును పూర్తి చేయాలి.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ ధాత్రిరెడ్డి

గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

విద్యార్థినులతో మాట్లాడుతున్న జెసి, ఐటిడిఎ పిఒ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులు చదువుపై పూర్తిశ్రద్ధ వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ పి.ధాత్రిరెడ్డి సూచించారు. మండలంలోని పాలకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులంతా ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యాప్రమాణాలపై విద్యార్థినులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని, ఆ దిశగా చదువుపై పూర్తిశ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పాఠశాల వసతి గృహ ఆవరణను పరిశీలించారు.

23, 24 తేదీల్లో అంతర్జాతీయ వెబినార్

ఏలూరు అర్బన్ : ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కైకలూరు వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో రీసెర్చ్ మెథడాలజీ ఇన్ మెటీరియల్స్ సైన్స్ అంశంపై ఇంటర్నేషనల్ వెబినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో వెబినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వెబినార్ సమన్వయకర్త కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు కె.రమేష్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

జిల్లాస్థాయి పోటీల్లో సంతోష్ ప్రతిభ


సంతోష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థుల్లో శ్రమించే తత్వం, పట్టుదల, లక్ష్యం ఉంటే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ప్రశంసించారు. గత నెల 27వ తేదీన జరిగిన యువ ఉత్సవ జిల్లా స్థాయి వివిధ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆర్.సంతోష్ తెలుగు కవితల్లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస రావు మాట్లాడుతూ ఈ ఘనత అధ్యాపకుల కృషేనని అభినందించారు. అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

ప్రజాశక్తి ప్రజల పక్షం

క్యాలెండర్ ఆవిష్కరణలో టిడిపి మండలాధ్యక్షులు డలరామ్

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజల కోసం పాటు పడుతూ అందరి మన్ననలను పొందుతున్న ప్రజాశక్తి దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతుందని టిడిపి మండలాధ్యక్షులు దేవినేని డలరామ్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో ప్రజాశక్తి 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన తరగతులవారికి ప్రజాశక్తి దినపత్రిక అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు పాకనాటి ఆంజనేయులు, మండల నాయకులు పాకనాటి సీతారామ్, తలకొండ రంగారావు, గోగం బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డలరామ్

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు వినియోగించుకోవాలని తహశీల్దార్ డి.ప్రమాద్వార తెలిపారు. మండలంలోని యర్రంపల్లి పంచాయతీలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం :భూ పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. మండలంలోని రాజుపోతేపల్లిలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. తహశీల్దార్ సాయిబాబా మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 600 వరకు భూసమస్యల ఫిర్యాదులకు 225 సమస్యలు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు.

లింగపాలెం : మండలంలోని కొణిజర్ల గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు తహశీల్దార్ నజీముల్లాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు.

ఘనంగా జోగిరాజు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కలిదిండి

టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు పుట్టినరోజు వేడుకలను గురువారం కలిదిండిలోని ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు, అధికారులు పుట్టినరోజు శుభాకంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, మాజీ జెడ్‌పిటిసి నున్నా రమాదేవి, నాయకులు మోహనరావు, నాగబాబు, వెంకట సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామల, విఆర్‌ఒలు ఆయనకు శుభాకంక్షలు తెలిపారు.


పుట్టినరోజు వేడుకల్లో జోగిరాజు

మన్మోహన్ సింగ్ సంతాప సభ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప సభ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ భారత దేశానికి ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత స్థానంలోకొ తీసుకెళ్లిన గొప్ప ప్రధాని అని అన్నారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, దేశానికి తీరని లోటని ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ గౌడు రంగబాబు, దొండబోయిన చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - దెందులూరు

ప్రణాళికాయుతమైన చక్కని బోధన, మంచి క్రమశిక్షణతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాధులు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ హితవు పలికారు. ఎస్‌టియు 2025 నూతన డైరీ, క్యాలెండర్‌ను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ గురువారం దుగ్గిరాలలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పరసా నాగార్జున, టి.ప్రవీణ్‌కుమార్, అమృత్, ప్రభాకర్ గుప్తా, షఫీ, రమేష్ పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చింతమనేని

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

నూజివీడు టౌన్: మండల పరిధిలోని మర్రిబంధం, మీర్జాపురం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు ద్వారా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను నూజివీడు ఎంపిడిఒ రాఘవేంద్రనాథ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రిబంధం గ్రామంలో 163 మీటర్ల పొడవు రోడ్డును రూ.తొమ్మిది లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే మీర్జాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మూడు రోడ్లను సుమారు 450 మీటర్ల రోడ్లను రూ.24 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు.

నేరాలు - ఘోరాలు

చెక్ బౌన్స్ కేసులో జైలు, జరిమానా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా, బాధితులకు రూ.2.80 లక్షల పరిహారం చెల్లించాలని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పునిచ్చారు. సత్తుపల్లికి చెందిన షేక్ చాందిని 2021లో ధారా రామకిషోర్ నుంచి రూ.మూడు లక్షలు అప్పుగా తీసుకుని చెక్కు ఇచ్చారు. చెక్ బౌన్స్ కావడంతో అడ్వకేట్ సిహెచ్.తేజ్ చంద్‌ను సంప్రదించారు. ఫిర్యాదు తరపు న్యాయవాది తేజ్ చంద్ వాదనలు వినిపించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని దర్భగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పైడిమర్ల సోమిరెడ్డి (65) కిరాణా సరుకులు కొనుగోలు చేసి సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో అతడిని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ నవీన్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పేకాటస్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుట్టు చప్పుడు కాకుండా రహస్యంగా పేకాడుతున్న పేకాటరాయుళ్లను బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విఎస్.వీరభద్రుడు గురువారం తెలిపారు. ముదినేపల్లిలో పేకాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.24,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పిఎస్‌డి.భోగేశ్వరరావు సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన అనగాని రాంబాబు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మస్తానయ్య తెలిపారు. నిందితుడిని కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మార్చి నాటికి హాస్టల్ భవనాలకు మరమ్మతులు

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం
ఏలూరు ఎఎస్‌డబ్ల్యు బి.రమేష్

చిట్ చాట్

ప్రజాశక్తి - దెందులూరు

సంక్షేమ వసతి గృహాల్లో ఉండేవారంతా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులే. కూలీ, నాలి చేసుకుంటూ ఇంటి వద్ద నుంచి పాఠశాలకు పిల్లలను పంపలేక ఎన్నో ఆశలతో తమ పిల్లలను సంక్షేమ హాస్టళ్లకు పంపుతున్నారు. అయితే అక్కడ తగిన సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక అగచాట్లు పడుతున్న పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ వసతి గృహాలను పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను గాడిన పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.ర ఏలూరు పరిధిలో సంక్షేమ వసతి గృహాల ప్రగతి పట్టాలు ఎక్కుతుందని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ఏలూరు పరిధిలో ఎంతమంది విద్యార్థులు వసతి పొందుతున్నారు?

ఎఎస్‌డబ్ల్యు : ఏలూరు ఎఎస్‌డబ్ల్యు పరిధిలో మొత్తం 11 వసతి గృహాలు ఉన్నాయి. ఆరు కాలేజీ హాస్టల్స్ కాగా, ఐదు పాఠశాల స్థాయి చిన్నారులు ఉండే వసతి గృహాలు. వీటిలో 900 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. రెండు వసతి గృహాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా, మిగిలిన తొమ్మిది ప్రభుత్వ భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కొత్త భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

ప్రశ్న : వసతి గృహాల్లో నిర్వహణ లోపాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నయి కదా.. ఎప్పటికి పరిష్కరిస్తారు?

ఎఎస్‌డబ్ల్యు : గత ప్రభుత్వంలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల వసతి గృహాల భవనాలకు మర్మమతులు చేయలేకపోయాం. కొత్త ప్రభుత్వం రావడంగానే దీనిపై దృష్టి పెట్టింది. ఏలూరు పరిధిలోని 11 వసతి గృహాల్లో మరమ్మతుల కోసం సుమారు రూ.70 లక్షలకు నిధులు కేటాయించింది. కలెక్టర్, జెడి జయప్రకాష్ ఆదేశాల మేరకు వీటిని మార్చి 2025లోగా పూర్తి చేయనున్నాం. అందుకు సంబంధించిన టెండర్లను పిలుస్తున్నాం. ఇక విద్యార్థులకు ఎలాంటి కొరత, ఇబ్బంది రానీయం.

ప్రశ్న : గతంలో కొవ్వలి వంటి పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి కదా, ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

ఎఎస్‌డబ్ల్యు : గతంలో నిధుల కొరత, సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బంది పడిన మాట వాస్తవం. కలెక్టర్ వెట్రిసెల్వి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చొరవ తీసుకుని తక్షణం నిధులు కేటాయించి మరమ్మతులు చేయించారు. ఏళ్ల నాటి శానిటేషన్ సమస్య పరిస్కారమైంది. సిబ్బంది పనితీరు మెరుగుపరిచాం.

ప్రశ్న : పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నారు?

ఎఎస్‌డబ్ల్యు : పదో తరగతిలో వంద శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు విద్యా వలంటీర్లను నియమించాం. 2022-23లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈసారి సాధిస్తాం. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కళాశాల అయిపోయాక ప్రత్యేక తరగతులు వసతి గృహాల్లో నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : విద్యార్థులకు కాస్మోటిక్స్ ఛార్జీలు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి కదా? నిజమెంత?

ఎఎస్‌డబ్ల్యు : కాస్మోటిక్ ఛార్జీలు గత ప్రభుత్వంలో విడుదల చేయలేదు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేసింది. పెద్దవాళ్లకు రూ.200, చిన్న పిల్లలకు రూ.160 వారి ఖాతాలోనే జమ అవుతున్నాయి. విద్యార్థులకు దుప్పట్లు, దవాఖానాలు ఇప్పటికే అందించాం.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా?

ఎఎస్‌డబ్ల్యు : వసతి గృహ అధికారులు ఉన్నారు. నాలుగో తరగతి సిబ్బంది కొరత ఉంది. కాలేజీ హాస్టల్స్‌లో అసలు సిబ్బందిని నియమించలేదు. ప్రయివేటుగా నియమించి హాస్టల్స్ నడిపిస్తున్నాం. సిబ్బంది కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాం.

ప్రశ్న : వసతి గృహాల్లో మెనూ అమలుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

ఎఎస్‌డబ్ల్యు : వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. జెడి జయప్రకాష్ అలాంటి వాటిని ఉపేక్షించరు. మెనూ అమలు చేయరనే ప్రశ్న తలెత్తదు. పేద పిల్లలకు మేలు చేయడమే మా లక్ష్యం. అందుకు అనుగుణంగా పనిచేస్తాం.

పంట పొలాల పరిరక్షణకు చర్యలు

మురుగు బోదెలు, కాలువల ప్రక్షాళనకు సహకరించాలి
ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రతి ఏటా వర్షాకాలంలో వేలాది ఎకరాల పంట ముంపుతో తీవ్రంగా నష్టపోతున్నామని, మరో పక్క వేసవిలో మెరక పొలాలకు నీరందక బీడు పొలాలతో దిగుబడులు తగ్గి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ఈ పరిణామానికి శాశ్వత పరిష్కారం కోసమే సాగునీటి, మురుగునీటి, రెవెన్యూ, మత్స్యశాఖల అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లతో ముఖాముఖి సమావేశం నిర్వహించామని ఎంఎల్ఎ ధర్మరాజు తెలిపారు. సమస్య పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన చెప్పారు. గురువారం నారాయణపురంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ చేపలు చెరువులు తవ్వేటప్పుడు నిబంధనల మేరకు మురుగు బోదెలు తవ్వడంలేదని, మురుగు పారే మార్గం లేక సాగునీటి కాలువలు కాలుష్యం బారిన పడుతున్నాయన్ని వాపోయారు. పది అడుగులు వెడల్పు ఉండాల్సిన మురుగు కాలువలు మీటరు వెడల్పుకు తగ్గిపోయాయని, ప్రక్షాళన చేస్తే కాని సమస్య పరిష్కారం కాదని చెప్పారు. గణపవరం మండలం మొయ్యేరు నీటి సంఘం ప్రతినిధి మాట్లాడుతూ 2020లో కోమర్రు, కోడిపల్లి, మొయ్యేరు, వృదాళ్లపాలెంలో మూడు వేల ఎకరాలకు నీటిని వదిలే ఛానల్‌లో గండి పడితే రైతులే చందాలు పోగేసి రూ.ఎనిమిది లక్షలు ఇరిగేషన్ అధికారులకు ఇచ్చామని తెలిపారు. గండిని పూడ్చారు కాని కుంగిపోతుందని, శాశ్వత పరిష్కారం కోసం కల్వర్టులు కట్టాలని కోరారు. ఎస్.కొండేపాడు, మాలకోడు ఆక్రమణలను తొలగించి సాగు, మురుగునీటి పరిష్కారానికి చర్యలు చేపట్టామని గణపవరం తహశీల్దార్ వైకెవి.అప్పారావు వెల్లడించారు. అనంతరం ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ డెల్టా గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటితో పాటు వరదల నుంచి పొలాలను రక్షించేందుకు అవసరమైన కార్యాచరణ, అంచనా వ్యయాలను వారం రోజుల్లో తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మురుగు కాలువలు, పంట కాలువలు కలిసిపోయి నీరు కాలుష్యం కాకుండా రెవెన్యూ రికార్డుల ప్రకారం హద్దు గుర్తించి ఆక్రమణలకు గురైన బోదెలు, కాలువలను ప్రక్షాళన చేసేందుకు మీరంతా సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో 23 నీటి సంఘం అధ్యక్షులు, నలుగురు డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్లు, ఇరిగేషన్ డిఇలు సుబ్రహ్మణేశ్వరరావు, సత్యనారాయమూర్తి, డ్రెయిన్స్ డిఇ కె.వరప్రసాద్, నాలుగు మండలాల తహశీల్దార్లు, వ్యవసాయ శాఖ ఎడిలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యుటిఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒలు కె.శ్రీనివాస్, బుచ్చయ్యలు గురువారం ఆవిష్కరించారు. నూతన క్యాలెండర్, డైరీను మండల ఉపాధ్యక్షుడు ఆర్.సోమేశ్వంరావుకు అందించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు అందించారు.

కుక్కునూరు : కుక్కునూరు జెడ్‌పి హై స్కూల్‌లో యుటిఎఫ్ క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ నేతకు పితృవియోగం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

యుటిఎఫ్ చాట్రాయి మండల కార్యదర్శి, తుమ్మగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఉర్దూ) ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు తండ్రి గంపా లక్ష్మయ్య(68) గురువారం ఆగిరిపల్లిలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహాన్ని యుటిఎఫ్ ఆగిరిపల్లి మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవిడి.లక్ష్మి, కె.అజరయ్య, నాయకులు చూడామణి, జీవరత్న, రాంగోపాల్, ఐబి.రవికుమార్, కె.కోటేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, జ్ఞానసుందరం, పలు పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

మాధవరావు మృతి బాధాకరం

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుంజా మాధవరావు మృతి బాధాకరమని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. గురువారం ముదినేపల్లిలో వారు మాట్లాడుతూ మండలంలో మాధవరావు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా విశేష సేవలందించారన్నారు. ఆయన సర్వీసులో ఎక్కువ కాలం ముదినేపల్లి మండలంలోనే పని చేసి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉత్తమ సేవలందించారని, ఆయన మృతి ఎంతో బాధాకరమన్నారు. మాధవరావు కుటుంబసభ్యులకు వారు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం మాధవరావు కృష్ణా జిల్లా పెదపారుపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఎఒ)గా పని చేస్తున్నారు. తిరుపతి నుంచి ట్రెయిన్‌లో గుడివాడ వస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుతో మరణించారని తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

నూతన సంవత్సరం సందర్భంగా పోలవరం మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సీయోను ప్రార్థనా మందిరం పాథర్ ఆకుమర్తి డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి - ముసునూరు

ఆముదాల తిరుపతయ్య మేరీ రత్నావళి ట్రస్ట్ అధినేత ఆముదాల కాంతారావు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం మేరీ రత్నావళి పుట్టినరోజును పురస్కరించుకుని స్వగ్రామం రమణక్కపేటలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనేక ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు టివిఎస్.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథ్, ఎంపిపి దుర్గాభవాని, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కమిటీ మెంబర్ పాశం నాగబాబు, రైతు సంఘం జిల్లా నాయకులు రాయింకుల లక్ష్మణరావు, జి.రమేష్, పీడీ వాకా నాగరాజు, ఉపాధ్యాయురాలు శాలిని పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు అన్నదానం

ప్రజాశక్తి - దెందులూరు

తల్లిదండ్రులు లేని విద్యార్థుల పట్ల ప్రతిఒక్కరూ ఆదరణ చూపాలని కాంగ్రెస్ నాయకురాలు కావూరి లావణ్య పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి ఏలూరు గ్జేవియర్ నగర్‌లోని విహాన్ ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులతో నూతన సంవత్సర వేడుకలను కావూరి లావణ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేశారు. విద్యార్థులతో మమేకమై కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విహాన్ ఛారిటబుల్ ట్రస్టు విద్యార్థులకు అవసరం మేరకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కుటుంబ వ్యవస్థ పట్ల బాధ్యతగా ఉంటే బిడ్డలు అనాథలుగా మారరన్నారు. విహాన్ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులను ఆమె అభినందించారు. ట్రస్టు విద్యార్థులందరూ మంచి క్రమశిక్షణతో మెలిగి ఉన్నతభ్యాసం చేసి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్, అంజిబాబు, టి.సుమన్‌బాబు, లక్కీ పాల్గొన్నారు.

విద్యార్థులతో భోజనం చేస్తున్న లావణ్య

ట్రైకర్ కారక్రమాలు ముందుకు తీసుకెళ్లాలి

బుట్టాయగూడెం :గిరిజన సంక్షేమానికి ఉద్దేశించిన ట్రైకర్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అధికారులను కోరారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ట్రైకర్ కార్యకలాపాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ పి.ధాత్రిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ట్రైకర్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని జెసి పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ నిరుద్యోగ గిరిజన యువత వలసలు పోకుండా స్వయం ఉపాధిమ పొందేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

హిందూ మాలలను క్రిస్టియన్ మాలలుగా మార్చారు

డిటికి బోయగూడెం గ్రామస్తుల వినతి

చింతలపూడి :ఇటీవల జరిగిన సర్వేలో హిందూమాలలను క్రిస్టియన్ మాలలుగా చేర్చారని బోయగూడెం గ్రామస్తులు చింతలపూడి డిప్యూటీ తహశీల్దార్ షకీలాకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దాదాపుగా 150 కుటుంబాలు ఉన్నాయని వర్గీకరణ నిమిత్తం ఇటీవల జరిగిన సర్వేలో దాదాపుగా వంద కుటుంబాలను హిందూ మాలగ కాకుండా క్రిస్టియన్ మాలగా చూపించారన్నారు. బోయగూడెంలో ఒసి సామాజిక తరగతుల వారిని కూడా క్రిస్టియన్ మాలగా చూపించారన్నారు. దీంతో ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలకు దూరమవుతున్నామని, గ్రామస్థాయిలో మరొక సర్వేను జరిపించాలని కోరారు.

ఎస్‌ఎంసి విధులు, బాధ్యతలపై శిక్షణ

ప్రజాశక్తి - భీమడోలు

ప్రతి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాఠశాల యాజమాన్య కమిటీలు తమ సహకారాన్ని అందించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు కోరారు. భీమడోలు హైస్కూలులో గురువారం మండల పరిధిలో ఉన్న పాఠశాలల యాజమాన్య కమిటీలకు వారి విధులు, బాధ్యతల పట్ల అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణా తరగతులను నిర్వహించారు.

కొయ్యలగూడెం :మండలంలోని పరింపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసి) విధులు, బాధ్యతలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

చాట్రాయి : పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణా కారక్రమాన్ని చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఎంఇఒ విఎస్‌వి.బ్రహ్మాచారి పాల్గొని పలు విషయాలు వివరించారు. రిసోర్స్ పర్సన్స్‌గా ఎవి.వెంకటేశ్వరరావు, జయరాజు, శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు.

బుట్టాయగూడెం : మండలస్థాయిలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం బుట్టాయిగూడెంలో నిర్వహించారు. ఎంఇఒలు తెల్లం బాబూరావు, సిహెచ్.నరేంద్రరాయ్ అధ్యక్షత వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా పి.శ్రీనివాసరావు, కె.బ్రహ్మాజీ, ఎం.బాలాజీ, కె.మోహన్‌రావు వ్యవహరించారు.

ముసునూరు : మండలంలోని ఎస్‌ఎంసి సభ్యులకు, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు తెలిపారు. ముసునూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు.

టి.నరసాపురం :పాఠశాల అభివృద్ధిలో యాజమాన్య కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలని ఎంఇఒలు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి అన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు ఒక రోజు శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఎస్‌ఎంసి సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఇఒలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్ మాట్లాడారు.

వీధి కుక్కలు పట్టివేత

ముదినేపల్లి:ముదినేపల్లిలో వీధి కుక్కలను పట్టి వేసినట్లు పంచాయతీ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, పంచాయితీ కార్యదర్శి జి.రమేష్ గురువారం తెలిపారు. వీధి కుక్కలతో గ్రామస్తులు పడుతున్న ఇక్కట్లు పంచాయతీ దృష్టికి రావడంతో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మచిలీపట్నం నుంచి వచ్చిన కుక్కల వేటగాళ్ల బృందం వీధి కుక్కలను ఉచ్చులు వేసి బంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక వాహనంలో మచిలీపట్నం ప్రాంతంలోని మడఅడవుల్లో విడిచిపెట్టినట్లు తెలిపారు.

MUNICIPAL CORPORATION, ELURU

E-PROCUREMENT TENDER NOTICE

No.92-93/General/2024-25, **Dated : 02.01.2025.**

The Commissioner, Municipal Corporation, Eluru Invites tenders from interested, eligible bidders for **"Providing Balance Work CC road and Providing CC Platform in Municipal Corporation, Eluru"** Total No. of works is 2 with an amount of Rs.17.56 Lakhs.

Tender schedules are available on e-procurement market place from 03.01.2025. Last date of receipt of tenders is 06.01.2025 . Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- Commissioner
Municipal Corporation, Eluru.

ఎపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎపిటిఎఫ్ ముదినేపల్లి మండల శాఖ 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని గురువారం ముదినేపల్లిలో ఆవిష్కరించారు. ఎపి టిడిసి డైరెక్టర్, టిడిపి కైకలూరు నియోజకవర్గ కో-కన్వీనర్ కొడాలి వినోద్ క్యాలెండర్‌ను, డైరీని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

11 నుంచి 19 వరకు సెలవులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి రెండో సెమిస్టర్‌కు సంబంధించి మొదటి పరీక్షలు ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరుగుతున్నాయని, ఈ నెల ఐదో తేదీ లోగా అన్ని సబ్జెక్టులు మిడ్ సిలబస్ పూర్తి చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. ఆ దశగా అధ్యాపకులు కృషి చేస్తున్నారు. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు.

మృతుని కుటుంబానికి అర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మృతుని కుటుంబానికి టిడిపి తరపున గురువారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గురజ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త సుంకర వీరాస్వామి అనారోగ్య సమస్యతో ఇటీవల మృతి చెందారు. పార్టీ కార్యకర్త మృతి చెందిన విషయం స్థానిక నాయకుడు రామిశెట్టి మునిందర్ నాయుడు పార్టీ కో-కన్వీనర్ కొడాలి వినోద్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వినోద్ మృతుని కుటుంబ సభ్యులకు పార్టీ తరుపున రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు.

మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ,కాకినాడ
O.S.No.863/2024
Between:
దిండి వరలక్ష్మి ...వాది
మరియు
గుడిపూడి రమేష్ బాబు@ రమేష్ ...ప్రతివాది
To
గుడిపూడి రమేష్ బాబు, @ రమేష్, తండ్రి వెంకటరత్నం, వయస్సు 40సం॥లు. పోలీస్ కానిస్టేబుల్, పి.సి.నెం.3428, మందపల్లి గ్రామం, జాలిపూడి పోస్ట్, ఏలూరు రూరల్ మండలం, ఏలూరు జిల్లా.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీహజరు నిమిత్తం **ది.10-01-2025వ** తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **గం॥10.30** ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వింజమూరి వెంకటరావు
అడ్వకేటు,కాకినాడ
సెల్:9866550610

పాస్‌పోర్టు పడిపోయినది
పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం, ములపర్రు గ్రామానికి చెందిన ప్రసాద్ మామిడి శెట్టి, తండ్రి : సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. EC పాస్‌పోర్టు నెంబర్ : X0610733 గల పాస్పోర్ట్ ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుండగా నా యొక్క EC పాస్పోర్ట్ పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.
అడ్రస్ : **ప్రసాద్ మామిడి శెట్టి**
తండ్రి : సత్యనారాయణ, డోర్‌నెం :1-176
ములపర్రు, పెనుగొండ మండలం,
ప.గో.జిల్లా. సెల్ : 9573518142

పాస్‌పోర్టు పడిపోయినది
పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, మెయిన్ రోడ్, వెంకట్రామపురం గ్రామానికి చెందిన గంటా మేరి, భర్త : పౌలు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పాస్పోర్ట్ నెంబర్ : F0680192 గల పాస్పోర్ట్ పెనుగొండ జిరాక్స్ సెంటర్ నుండి వెంకట్రామపురం ఇంటికి వెళ్తుండగా నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.
గంటా మేరి, భర్త : పౌలు, డోర్ నెం : 1-23
మెయిన్ రోడ్, వెంకట్రామపురం
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా.
సెల్ : 7337228977

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం: 81/2023
ఇన్
ఓ.ఎస్. 323/2022
యడ్లపల్లి సుబ్బారావు ...... డి.హెచ్.ఆర్
వర్సెస్
తమన్న వెంకటమహాలక్ష్మి ..... జె.డి.ఆర్
టు,
జె.డి.ఆర్:
తమన్న వెంకటమహాలక్ష్మి, భర్త: నగేష్
ఇంటి నెం: పిహెచ్‌సి సెంటర్
ప్రస్తుతం నివాసం: తాడిమల్ల (గ్రామము)
నిడదవోలు మండలం, పచ్చిమ గోదావరి జిల్లా.
ఈ నెంబరు డి.హెచ్.ఆర్. నీ తాలూకు జీతమును జప్తు చేసి ఈ నెంబరు డిక్రీ బాకీలోనికి వసూలు ఇప్పించవలసినదిగా కోరుతూ ఈ ఇ.పి.ని దాఖలు చేసియున్నారు. ఇందుకు నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో 10-01-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా కానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 10-01-2025
వి.కాశయ్య, బిఎస్‌సి, బిఇడి, ఎల్ఎల్‌బి
డిహెచ్‌ఆర్ తరపు అడ్వకేట్
మార్కాపురం.